



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 322 | బుధవారం 10 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## కాంగ్రెస్‌కు షాక్

- రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

2



## మమతా బెనర్జీ ఇంట్లో సీఐడీ సోదాలు

2

## బ్రిక్స్ అధికారులు సమావేశం ప్రారంభం

- 13 వరకూ ఇండోర్‌లో జరగనున్న చర్చలు
- ఆహార భద్రతతో పాటు అంతర్జాతీయ వ్యవసాయ వాణిజ్యంపై చర్చ

2




## లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

- మూడు రోజులలో శాంతి ఒప్పందం : ట్రంప్
- పది మందికి పైగా మృతి
- దాడులు ఆపకుంటే పోరు తప్పదు : ఇరాన్ హెచ్చరిక

2



## అభివృద్ధి సూచికలు పెరగాలి

### -జిఎస్‌డిపి, జివిఎలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి - సూర్యవాస్తవం

అన్ని రంగాల్లో అభివృద్ధిని మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిఎస్‌డిపి, జివిఎలపై ప్రణాళిక శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల్లో కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్లపై దిశానిర్దేశం చేశారు. అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ



ప్రభుత్వ శాఖలకు కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటికే పలు శాఖల్లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచి అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతోపాటు వాస్తవిక వృద్ధి ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని

- మిగతా 3లో..

## కోలుకోని 'ఉక్కు' నగరం

- బాధితులకు పలువురి పరామర్శ
- మంత్రుల తీరు వివాదాస్పదం
- విశాఖకు చేరుకున్న త్రీ మెన్ కమిటీ
- మృతదేహాల గుర్తింపు



విశాఖ - సూర్యవాస్తవం

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న ఘోర ప్రమాద బాధితులను పలువురు పరామర్శిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎనిమిది మంది కార్మికులు సజీవంగా ఉక్కు ద్రావణంలో కాలిపోయిన దారుణ ఘటన సృష్టించిన పెను విషాదం నుండి ఉక్కు నగరం కోలుకోలేదు. ఎక్కడ చూసినా బాధితుల రోదనలు, ఆర్తనాదాలే కనిపిస్తున్నాయి. సంఘటన జరిగిన సోమవారం అర్ధరాత్రే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి విశాఖకు

- మిగతా 2లో..



## మోడీ జీ మీ వైఫల్యాలకు పేదలే మూల్యం చెల్లించాలా?

- నిలదీసిన కాంగ్రెస్ నేత రాహుల్

2

## మహిళా సాధికారతకు మరో అడుగు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ - సూర్యవాస్తవం

మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్

- మిగతా 2లో..

## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

- ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు
- బాధితులను పరామర్శించిన డిప్యూటీ సిఎం పవన్

3

## 15 రోజుల్లో నిధి పేరోల్‌లో ఉద్యోగుల నమోదు : ఆర్థికశాఖ

3

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# కాంగ్రెస్‌కు షాక్

## - రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి బరిలో నిలిపిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగళవారం నాడు తిరస్కరించా రు. ఆమె తన అఫిడవిట్‌లో ఒక క్రిమినల్ కేసు వివరాలను దాచిపెట్టారని బీజేపీ ఆరోపించడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో బిజెపికి చెందిన మహేష్ కేవత్ ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయమైంది. తెలంగాణలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన వివరాలను మీనాక్షి తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని, అందువల్లే ఆమె నామినేషన్‌ను తిరస్కరించామని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) అధికారులను కలిసి విజ్ఞప్తి చేయనున్నారు. కాగా కాంగ్రెస్ విజ్ఞాపనపై బుధవారం నాడు సిఇసి స్పందించేవీలుంది. కర్ణాటకకు చెందిన మీనాక్షి నటరాజన్..కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సన్నిహితురాలిగా పేరొందారు. ఆమె యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలుగా పనిచేశారు. ఈ స్థానంలో పార్టీ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించడంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సింగ్‌కు బదులుగా మీనాక్షిని బరిలోకి దించితే, కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపికి ఓటు వేయవచ్చని సీనియర్ నేత నరేష్ జ్ఞాన్‌చందాని ఇదివరకే పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వంతో సరైన సంప్రదింపులు జరపకుండా మీనాక్షిని బరిలోకి దించడం తగదని జ్ఞాన్‌చందాని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాడు మీనాక్షి నామినేషన్ దాఖలు చేశారు. ఆ వెంటనే జ్ఞాన్‌చందాని కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. దీంతో కేవలం రెండు సీట్లు మాత్రమే గెలిచే అవకాశం ఉన్న బిజెపి, మూడో సీటుకు తన అభ్యర్థిని ప్రకటించింది. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని ఒక రిసార్ట్‌కు తరలించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

# మమతా బెనర్జీ ఇంట్లో సీఐడీ సోదాలు

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

పశ్చిమ బెంగాల్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) బృందం మంగళవారం కోల్‌కతాలోని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నివాసానికి చేరుకుంది. సంతకాల ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి గత వారం సీఐడీ బృందం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకుడు అభిషేక్ బెనర్జీ నివాసాన్ని సందర్శించింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) శాసనసభ్యుల సంతకాల ఫోర్జరీ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి రాష్ట్ర సీఐడీ ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటీ) ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణను నిర్ధారించేందుకు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ణ×+) నేతృత్వంలో ాూ×ు పనిచేస్తోందని పోలీసు వర్గాలు తెలిపాయి. సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా, రాష్ట్ర జ×ణ విభాగం 13 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది.

# కోలుకోని 'ఉక్కు' నగరం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వామపక్ష, కార్మిక సంఘాల నేతలు బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. కార్మికుల కష్టాలను మంత్రి దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నించిన కార్మిక సంఘ నేతలపై లోకేష్ విరుచుకుపడ్డారు. 'మీ కుటుంబ సభ్యులెవ్వరూ చనిపోలేదు కదా...' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై కార్మికులు అక్కడికక్కడే నిరసన తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సైతం 'కార్మిక సంఘాలు ఒక్కో ప్రభుత్వంలో ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నాయి. ఈ ప్రమాదంపై కార్మిక సంఘాలనే మొదట నిలదీయాలి. కార్మికుల సంక్షేమం కార్మిక సంఘాలదే బాధ్యత... వారి సంక్షేమం కోసం యూనియన్ నాయకులు ఏం చేశారు? ' అని అన్నారు. బాధితులను పరామర్శించడానికి వచ్చి వీరిద్దరు చేసిన వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలతో పాటు, పలువురు ఖండించారు. కార్మిక సంఘాలు కోరుతున్న పరిహారంతో పాటు ప్రమాద కారణాలపై చర్చను పక్కదోవ పట్టించేందుకే వీరు ఇలా వ్యాఖ్యానించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులను పరామర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఘోర సంఘటనపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రీ మెన్ కమిటీ విశాఖకు చేరుకుని విచారణ ప్రారంభించింది. మరోవైపు ఈ దారుణంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో ఏడు మృత దేహాలను మంగళవారం సాయంత్రానికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# నేడు మోస్తరు వర్షాలు

**అమరావతి- సూర్య వాస్తవం**

రాష్ట్రంలో బుధవారం నాడు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. మరోవైపు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 42 డిగ్రీల మధ్య, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు.

# లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

## - మూడు రోజులలో శాంతి ఒప్పందం : ట్రంప్
## - పది మందికి పైగా మృతి దాడులు ఆపకుంటే పోరు తప్పదు : ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్ - సూర్య వాస్తవం**

లెబనాన్‌పై దాడులు ఆపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలను ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోంది. దక్షిణ లెబనాన్‌పై భీకర దాడులు కొనసాగిస్తోంది. దక్షిణ కోస్తా ప్రాంతంలోని టైర్ నగరాన్ని తక్షణమే ఖాళీ చేయాలంటూ ప్రజలకు ఆదేశాలు జారీ చేసిన ఇజ్రాయిల్ ఆ వెంటనే ఆ నగరంలోని జనావాస ప్రాంతంపై వైమానిక దాడులు చేసి ఎనిమిది మందిని బలి తీసుకుంది. ఇదిలావుండగా ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై చర్చలు తుది దశలో ఉన్నాయని, రాబోయే మూడు రోజులలో అది ఖరారవుతుందని ట్రంప్ చెప్పారు. ఒప్పందంపై సంతకాలు జరిగిన వెంటనే హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం జరుగుతుందని తెలిపారు. మరోవైపు లెబనాన్‌పై బాంబు దాడులు సహా దురాక్రమణ యత్నాలు ఆపని పక్షంలో తిరిగి పోరు ప్రారంభమవుతుందని ఇరాన్ తేల్చి చెప్పింది. ఇజ్రాయిల్ హెచ్చరికల నేపథ్యంలో లెబనాన్ పౌర రక్షణ కార్యకర్తలు టైర్ నగరంలోని వయోవృద్ధులను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇజ్రాయిల్ హెచ్చరికలతో భయాందోళనలకు గురైన ప్రజలు నగరాన్ని విడిచి పరుగులు తీశారు. నగరంలోని క్రిస్టియన్ క్వార్టర్ ప్రాంతాన్ని కూడా ఖాళీ చేయాలని ప్రజలను ఇజ్రాయిల్ ఆదేశించింది. గతంలో ఇజ్రాయిల్ సేనలు ఈ ప్రాంతాన్ని తమ హెచ్చరికల నుంచి మినహాయించారు. అయితే హిజ్బుల్లా ఫైటర్లు అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారని ఇజ్రాయిల్ తాజాగా ఆరోపించింది. కాగా అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కేంద్రానికి అత్యంత సమీపంలో కూడా దాడి జరిగింది. ఈ దాడిలో కనీసం ఐదుగురు చనిపోగా అనేక మంది రెడ్‌క్రాస్ సిబ్బంది గాయపడ్డారు. ఇదిలావుండగా దక్షిణ లెబనాన్‌లోని షర్కియెహ్ నగరంపై ఇజ్రాయిల్ సేనలు జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఇద్దరు పౌర రక్షణ కార్యకర్తలే.

**చర్చలలో భాగస్వామ్యం కోసమేనా?**

ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న శాంతి చర్చలలో తనకూ భాగస్వామ్యం కల్పించాలని ఇజ్రాయిల్ కోరుకుంటోంది. అందుకే ట్రంప్ ఆదేశాలను ధిక్కరించి ఇరాన్‌పై దాడులు చేసింది. శాంతి చర్చల నుంచి ఇజ్రాయిల్‌ను ట్రంప్ దూరం పెడుతున్న విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తొలిసారిగా రెండు రోజుల క్రితం ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు జరిపింది. అయితే కాల్పులు ఆపాలని ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలను ట్రంప్ కోరడంతో ఇరు పక్షాలు దాడులను నిలిపివేశాయి. కానీ ఎప్పుడైనా దాడులు తిరిగి మొదలయ్యే అవకాశం ఉన్నదని కూడా చెప్పాయి. తన ప్రయోజనాలను విస్మరిస్తే ఇరాన్‌తో ఎలాంటి తుది ఒప్పందం కుదరదని అమెరికాకు స్పష్టమైన సందేశం పంపేందుకే టెహ్రాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేసిందని విశ్లేషకులు తెలిపారు. ఫిబ్రవరిలో ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్ ఆ తర్వాత శాంతి చర్చల ప్రక్రియలో దానిని భాగస్వామిని చేయలేదు. ఇరాన్-అమెరికా మధ్య దౌత్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. లెబనాన్‌పై దాడులు ఆపడంతో పాటు శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని ఆయన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను గట్టిగానే హెచ్చరించారు. గత వారం ట్రంప్‌తో టెలిఫోన్ సంభాషణ జరిపిన తర్వాత బీరుట్‌పై వైమానిక దాడులను నెతన్యాహూ నిలిపివేశారు. అయితే నెతన్యాహూ వైఖరిపై ఇజ్రాయిల్‌లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అమెరికా మద్దతు తప్పదా?**

అమెరికా-ఇరాన్ మధ్య ఏ ఒప్పందం కుదిరినప్పటికీ దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లాపై దాడి చేసే హక్కును, అక్కడ తన సైనిక బలగాలను మోహరించే హక్కును ఇజ్రాయిల్ వదులుకోబోదని రక్షణ శాఖ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ట్రంప్ 9తో జరిగిన ఫోన్ సంభాషణలో కూడా నెతన్యాహూ ఇదే విషయాన్ని ప్రస్తావించారని తెలిపారు. ఇరాన్ మరోసారి దాడులకు దిగితే ప్రతి దాడులు తప్పవని నెతన్యాహూ ఇప్పటికే తేల్చి చెప్పారు. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఒంటరిగా సుదీర్ఘ వైమానిక దాడులను కొనసాగించలేదు.

అందుకు అమెరికా సహాయ సహకారాలు తప్పనిసరి. నెతన్యాహూ ఇటీవల తన సహాయకులతో మాట్లాడుతూ ఇరాన్ విషయంలో ట్రంప్ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి తన వద్ద ఎలాంటి ఎత్తుగడలు లేవని అంగీకరించారు. అమెరికా మద్దతు లేకుండా ఇరాన్‌పై దాడి చేసే సామర్థ్యం ఇజ్రాయిల్‌కు ఉన్నప్పటికీ ఆ దాడులను కొన్ని వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగించడానికి అమెరికా మద్దతు అవసరమవుతుందని నిపుణులు తెలిపారు.

# బ్రిక్స్ అధికారుల సమావేశం ప్రారంభం

## - 13 వరకూ ఇండోర్‌లో జరగనున్న చర్చలు
## - ఆహార భద్రతతో పాటు అంతర్జాతీయ వ్యవసాయ వాణిజ్యంపై చర్చ

**భోపాల్ - సూర్య వాస్తవం**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బ్రిక్స్ సభ్య దేశాల సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరగనున్న ఈ సమావేశాలకు మొదటి రోజు భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ (డిఎడబ్ల్యూ) కార్యదర్శి అతిష్ చంద్ర అధ్యక్షత వహించారు. వ్యవసాయ వర్కింగ్ గ్రూప్ అధికారిక స్థాయి చర్చలు గురువారం వరకు జరుగుతాయి. అనంతరం వచ్చే శుక్రవారం, శనివారాల్లో బ్రిక్స్ వ్యవసాయ మంత్రుల సమావేశమవుతారు. ఆహార భద్రత, వాతావరణ మార్పులను తట్టుకోగల స్మార్ట్ వ్యవసాయం, వ్యవసాయ వాణిజ్యం, రైతు సంక్షేమం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ? ఈ సందర్భంగా భారత వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అంతర్జాతీయ సహకార సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సాహు మాట్లాడుతూ, ఆహార భద్రత, వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం, వ్యవసాయ రంగంలో సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది బ్రిక్స్ దేశాలలో నివసిస్తున్నారని అజిత్ కుమార్ సాహు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులలో, ఆహార భద్రతను నిర్ధారించడం, భవిష్యత్తులో దానిని కొనసాగించడం బ్రిక్స్ దేశాలకు ఉమ్మడి సమస్య అని ఆయన అన్నారు. అలాగే "ఈ ఐదు రోజుల సదస్సులో ఆహార భద్రతతో పాటు అంతర్జాతీయ వ్యవసాయ వాణిజ్యాన్ని సులభతరం చేయడం, సరఫరా గొలుసులు, డిజిటల్ వ్యవసాయం, పరిశోధన, విజ్ఞాన మార్పిడి, కృత్రిమ మేధస్సు (ఎఐ), రోబోటిక్స్ వంటి అంశాలపై చర్చిస్తారు." బ్రిక్స్ వ్యవసాయ మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

**21 దేశాల ప్రతినిధులు హాజరు**

మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్ వ్యవసాయ సదస్సులో బ్రెజిల్, ఇండోనేషియా, చైనా, ఇరాన్, దక్షిణాఫ్రికా,యుఎఇతో పాటు ఇతర సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. 21 దేశాల వ్యవసాయ మంత్రులు, సీనియర్ అధికారులు, నిపుణులు ఈ సదస్సులో భాగస్వామ్యం వహిస్తున్నారు. మొదటి రోజు బహుళ సెషన్లు నిర్వహించారు.

ఆహార భద్రత, వ్యవసాయ ఆవిష్కరణలు, వాతావరణ అనుకూల వ్యవసాయం, వ్యవసాయ వాణిజ్యం, చిన్న రైతులను బలోపేతం చేయడం వంటివి ప్రధాన అంశాలు. ఈ నెల 12న వ్యవసాయ మంత్రుల మధ్య ప్రత్యేక చర్చలు జరుగనున్నాయి. విదేశీ ప్రతినిధులు ఇండోర్ గొప్ప సంస్కృతి, వారసత్వాన్ని ఆస్వాదించేందుకు రాజ్వాడ, ఛప్పన్ దుకాన్, సరాఫా, మాండు వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు.

# మోడీ జీ మీ వైఫల్యాలకు పేదలే మూల్యం చెల్లించాలా?

## - నిలదీసిన కాంగ్రెస్ నేత రాహుల్

**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం**

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మోడీ జీ మీ వైఫల్యాలకు పేదలే మూల్యం చెల్లించాలా?' అని నిలదీశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'కేంద్ర ప్రభుత్వం గత పుష్కరకాలంగా (12 ఏళ్లు) పేదల వ్యతిరేక ఆర్థిక విధానాలను అమల్జేస్తోంది. విదేశాంగ విధానాల్లో రాజీ పడిపోయింది. వీటి వినాశకర విధానాల కారణంగా వంట గ్యాసు ధర సిలిండర్‌పై గత మూడు నెలల్లో రూ.89 చొప్పున పెంచేశారు. అనేక రాష్ట్రాల్లో స్థానిక పన్నులు కలుపుకుంటే సిలిండరు ధర రూ.1000 పైబడింది. దీనివల్ల దేశంలోని లక్షలాది పేద కుటుంబాలు, ప్రధానంగా మహిళలు తిరిగి కట్టెల పొయ్యి పొగను పీల్చుకునే దుస్థితిలోకి కేంద్రంలోని మోడీ సర్కార్ నెట్టేసిందని ఆయన అన్నారు. 'ఉజ్వల' పథకంలో రాయితీ కింద అందించే సిలిండర్ల సంఖ్యను మోడీ ప్రభుత్వం 9 నుంచి 4కు తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లెల నుంచి పట్టణాలకు బతుకుజీవుడా? అంటూ పొట్ట చేత పట్టుకొని వచ్చిన వలస కార్మికులపైనా బిజెపి ప్రభుత్వం ఏమ్రాతం కనికరం చూడలేదన్నారు.

5 కిలోల వంట గ్యాసు సిలిండరు ధరను రూ.323కు పెంచేశారని, ఇలా ధరలన్నీ పెంచుకుంటూ పోతే వలస కార్మికులు ఏం తింటాడు? ఏం దాచుకుంటాడు? అని రాహుల్ ప్రశ్నించారు. ఒక వైపు పేదలపై ఇలా భారాలు మోపుతూ మరోవైపు శతకోటీశ్వర్లు అయిన కార్పొరేట్ మిత్రులకు మాత్రం మోడీ సర్కార్ రుణాలు మాఫీ చేస్తున్నారని, ఇది మోడీ మార్కు దోపిడీ విధానమని రాహుల్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 'మోడీజీ మీరు సృష్టించిన వినాశకర ఆర్థిక వ్యవస్థ విధానాలకు కార్మికులు, రైతులు, మహిళలు, మధ్యతరగతి, నిరుపేద ప్రజానీకమే మూల్యం చెల్లించుకుకోవాలా?' అని రాహుల్ ప్రశ్నించారు.

**విద్యార్థులు బలైపోతుంటే నోరు మెదపరా?**

జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలోనూ కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రాహుల్ అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా 22 లక్షల మంది విద్యార్థులు వంచనకు గురయ్యారని, అనేక మంది బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. కానీ ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదని ఆయన ఆక్షేపించారు. ఇప్పటికైనా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, లేదా ఈ ఘోర వైఫల్యానికి ప్రధాని మోడీయే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## ట్రంప్‌కు వీసా దెబ్బ !



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగిస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# డిజిలైటేజషన్, ఎఐలదే కీలక భూమిక

- విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సాగాలి
- విక్రమ సింహపురి స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల నజీర్ పిలుపు




**నెల్లూరు - సూర్య వాస్తవం**

ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఎ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్- టు - విలేజ్, ల్యాబ్ - టు - ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.





# అభివృద్ధి సూచికలు పెరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయాలని స్పష్టం చేసారు. అలాగే రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో మౌలిక సదుపాయాలపై చేసే వ్యయంపైనా సమీక్షించారు. ఈ రంగంపై చేసే వ్యయంలో కనీసం 3.5 రెట్ల వరకు ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రోత్సాహం అందించాలన్నారు. రియల్ టైమ్ లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని సూచించారు. 2047 వరకు నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా గవర్నెన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని రంగాల్లో సమగ్ర వాల్యూ అడిషన్ పెంచేందుకు శ్రద్ధ పెట్టాలన్నారు. ఉత్పాదక రంగం, తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా వంటి రంగాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ రంగాల్లో కేపీఐలు ఎంత మెరుగ్గా ఉంటే వృద్ధి రేటు కూడా అంతగా పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జిఎస్డిపి పైన అధికారులతో చర్చించారు. అన్ని శాఖల్లో నిర్దేశించిన వృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు**

ఎన్‌డిఎ, నీతి ఆయోగ్ సమావేశాలకు హాజరు సిఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనకు ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో సిఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం నాడు ఉదయం 11:30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల సమావేశానికి ఆయన హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో పాల్గొంటారు. 11వ తేదీ గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 9:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు సిఎం చంద్రబాబు అమరావతి చేరుకుంటారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

- ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు
- బాధితులను పరామర్శించిన డిప్యూటి సిఎం పవన్



**విశాఖపట్నం- సూర్యవాస్తవం:** విశాఖ ఉక్కు కర్మాగారంలో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న ఆయన, మొదట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం స్టీల్ ఎ÷-లాంట్ పరిధిలోని ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, యాజమాన్యంతో మాట్లాడారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలోనే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పవన్ కల్యాణ్ కీలక ప్యాకేజీని ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షల పరిహారంతో పాటు, మృతుల కుటుంబాలకు అదనంగా రూ. 25 లక్షల సహాయం అందజేస్తామన్నారు. అంతేకాకుండా, స్టీల్ ఎ÷-లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఎవరూ నివాసాల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి కార్మికుడు తమ రిటైర్మెంట్ వరకు స్టీల్ ఎ÷-లాంట్ క్వార్టర్స్ లోనే కొనసాగేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# 15 రోజుల్లో నిధి పేరోల్‌లో ఉద్యోగుల నమోదు : ఆర్థికశాఖ

**అమరావతి- సూర్యవాస్తవం:** అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు తమ పరిధిలోని సంస్థల్లో నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్థికశాఖ కార్యదర్శి వడరేవు వినయ్ చంద్ ఆదేశించారు. సమస్యలున్న శాఖలు వెంటనే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందేలా అన్ని శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధి పేరోల్ అప్లికేషన్‌లో అన్ని కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, తాత్కాలిక ఉద్యోగుల వివరాలను నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని శాఖలు ఆ ప్రక్రియను పూర్తి చేయలేదని ప్రభుత్వం గుర్తించింది. పోస్టుల కొనసాగింపునకు సంబంధించిన ఉత్తర్వులు లేకపోవడం, మంజూరు ఉత్తర్వుల ప్రతులు అందుబాటులో లేకపోవడం, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి కేటాయించిన పోస్టుల సంఖ్యపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతోందని పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధిపతులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ జాప్యం వల్ల కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమకు రావాల్సిన వేతనాలకు దూరమవుతున్నారని, ఇది ప్రభుత్వ దృష్టిలో ఆందోళనకరమైన అంశమని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

# సీఐ శ్రీరామ్ విధులలో ఉంటే
# బాధితులకు అభయం, నేరస్తులకు భయం

**- నేర పరిశోధనలో సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సిఐ శ్రీరామ్**
**- బాధితులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా అడుగులు**



**పులివెందుల- సూర్య వాస్తవం :** బాధి తులకు అభయం మరియు నేరస్తులకు నేరం చేయాలంటే భయం పుట్టేలా పులి వెందుల అర్బన్ సీఐ తమ విధులు నిర్వహిస్తున్నారని, నేర పరిశోధనలో సాంకేతికతను అందిపుచ్చుకొని రాబడుతున్నారని, బాధితులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా సీఐ శ్రీరామ్ అడుగులు వేస్తున్నారని పులివెందుల పురప్రజలు శ్రీరామ్ నీ ప్రశంసిస్తున్నారు. పులివెందుల పోలీస్ స్టేషన్లో అర్బన్ సీఐగా శ్రీరామ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పులివెందులలో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారి భరతం పడుతున్నాడు ,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరి సమస్యలను సానుకూలంగా వింటూ, వారి నుంచి ఫిర్యాదును స్వీకరించి, సకాలంలో సమస్యను పరిష్కరిస్తున్నారు. అలాగే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న దొంగతనాల కేసులను చేదిస్తూ వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి భారీగా నగదును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేస్తున్నారు. గంజాయిని విక్రయిస్తూ తమ జేబులు నింపుకునేందుకు యువకుల జీవితాలను బుగ్గి పాలు చేస్తున్న గంజాయి విక్రేతల భరతం పట్టారు.గత రెండు నెలల క్రితం అంతర్ రాష్ట్ర దొంగల ముఠా, గంజాయి,చైన్ స్నాచింగ్ కు పాల్పడ్డ 17 మందిని అరెస్టు చేసి, పులివెందులలో ఎన్నడు లేని విధంగా 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టు ముందు హాజరు పరిచారు. అలాగే పులివెందులతో పాటు,జిల్లాలో పలు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగలించిన ఏడు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి, బంగారు,వెండి,ఆభరణాలతో పాటు 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా పశువులు, పందులు, గొర్రెలు, ద్విచక్ర వాహనాలను దొంగలించి, బాధితులు అడ్డువస్తే రాళ్లు,సీసాలనుతో దాడి చేసి, అడ్డు వచ్చిన వాహ నాలను ఢీ కొట్టి, పోలీసుల కన్నుగప్పి తప్పించుకుంటున్న అనంతపురంకు చెందిన దొంగలతో పాటు బుల్లెట్ వాహనాన్ని దొంగలించిన దుండగులను చాకచక్యంతో పోలీస్ సిబ్బందితో కలిసి అరెస్టు చేసి వారి వద్ద నుంచిరూ 30, 65,000 రూపా యల రికవరీ, ఒక బుల్లెట్ వాహనంను స్వాధీనం చేసుకొని బాధితుల నుంచి శభాష్ శ్రీరామ్ అనిపించుకున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టు చేసిన నిందితులలో పలు స్టేషన్లలో దాదాపు 22 కేసులు ఉన్నట్లు సమాచారం. పోలీస్ స్టేషన్కు వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించి, పెండింగ్ లో ఉన్న దొంగతనాల కేసులను ఛేదించి నిందితుల వద్ద నుంచి భారీగా నగదును రికవరీ చేసి, పోయింది,ఇక రాదు అనుకున్న సొమ్మును బాధితులకు అందజేసి ప్రతి ఒక్కరి మన్ననలు పొందుతున్నాడు. ఆకతాయిల ఆట కట్టించి, గంజాయి బాచ్లను చట్టపరంగా రిమాండ్ చేయడంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో పులివెందుల ప్రజలు జీవిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## సకాలంలో వర్షాలు కురవాలని గ్రామదేవతలకు బోనాలు సమర్పణ





**కూడేరు - సూర్య వాస్తవం :** మండల పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లి గ్రామంలో బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. గ్రామం ప్రశాంతంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని మరియు సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ గ్రామస్తులు ఈ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు:**

**కుంటెమ్మ దేవతకు ఆరాధన:** ఉత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దలు, భక్తులు మొదటగా కుంటెమ్మ దేవతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి గ్రామ మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి శాంతి కోసం ప్రత్యేక పూజలతో పాటు సంప్రదాయబద్ధంగా బలులు అర్పించారు.సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని, గ్రామంలో ఎలాంటి అరిష్టాలు లేకుండా ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలనేదే మా సంకల్పం. అని గ్రామ పెద్దలు, భక్తాదులు తమ నమ్మకాన్ని వెలిబుచ్చారు.?ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు భక్తాదులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక మరియు పండుగ వాతావరణం సంతరించుకుంది.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మదనపల్లి తహసీల్దార్ టి.మాధవి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** మదనపల్లి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.మాధవి మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి. మాధవి జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మదనపల్లి మండల పరిధిలోని రెవెన్యూ శాఖ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు,జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదానికి బాద్యులను కఠినంగా శిక్షించాలి

**- కేంద్రం ప్రకటించిన నష్ట పరిహారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనంగా రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి**

**- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలాప్రసాద్**



**పులివెందుల - సూర్య వాస్తవం :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కార్మిక సోదరుల మృతికి తీవ్ర సంతాపం తెలియజేస్తున్నామని, జాతీయ దళిత ఫెడరేషన్ ఆఫ్, ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రమాదం మాత్రమే కాదు, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా జరిగిన హత్యలు. దీనికి బాద్యులయిన వారిని కఠినంగా శిక్షించాలి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి వచ్చి మరణించిన వారి కుటుంబ సభ్యులకు, అదేవిదంగా క్షత గాత్రులకు,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, వారి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి వర్యులు కుమారస్వామి, శ్రీనివాసరాజు,రామ్మోహన్ నాయుడు, ఎంపీ శ్రీభరత్‌లకు ధన్యవాదములు తెలుపుతూ కేంద్రం ప్రకటించిన నష్ట పరిహారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా చనిపోయిన వారి కుటుంబంనకు 30 లక్షలు, క్షత గాత్రుల కుటుంబాలకు 10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాడ్ చేస్తున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా, జీతాలు పూర్తిగా రాకపోయినా, కనీస సౌకర్యాలు కూడా లేకపోయినా అకుంటిత దీక్షతో ఉత్పత్తి, ఉత్పాధకాలలో ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పని చేస్తున్న కార్మిక సోదరులకు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరుకుంటూ, మరణించిన, క్షత గాత్రుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి, నివాళులు అర్పిస్తున్నాను అని కోలా ప్రసాద్ తెలిపారు

## అంగన్వాడీ కార్యకర్తలకు ఏఐ స్క్రీనింగ్ శిక్షణ



**మడకశిర - సూర్య వాస్తవం :** మండల పరిధిలోని హారేసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు అంగన్వాడీ కార్య కర్తలకు "ఏఐ ఎనేబుల్ స్క్రీనింగ్"పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ?పుట్టినప్పటి నుంచి ఆరు సంవత్సరాల లోపు వయసు గల పిల్లలలో వచ్చే శారీరక, మానసిక అభివృద్ధి ఆలస్యాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారి అంతర్గత సామర్థ్యాలను మెరుగుపరచడమే ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ?ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి శిశువుకు రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు గల మొదటి వెయ్యి రోజులు ఆ పిల్లల భవిష్యత్తుకు, మెదడు ఎదుగుదలకు అత్యంత కీలకమైనవని స్పష్టం చేశారు. ఈ కాలంలో పిల్లల ఎదుగుదలలో లోపాలను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఎంతగానో దోహద పడుతుందని, దీని ద్వారా క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల ఆరోగ్యంపై మరింత నిఘా ఉంచవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 12న నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలకు తరలిరండి

**- మండల వైకాపా అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి**



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** గడచిన రెండు సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి చేస్తున్న నిరంకుశ పాలనను నిరసిస్తూ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీలకు వైకాపా శ్రేణులు తరలి రావాలని సింహాద్రిపురం మండల వైకాపా అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలుగా అప్రజాస్వామ్య, అనైతిక పరిపాలన కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, రాష్ట్ర వనరుల దోపిడీకి పాల్పడుతోందని, పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలను నిరసిస్తూ "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలలో భాగంగా జూన్ 12వ తేదీ శుక్రవారం రాష్ట్రంలోని 175 నియోజకవర్గ కేంద్రాలలో భారీ ర్యాలీలు నిర్వహించాలని పార్టీ నిర్ణయంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్య క్రమంలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలు, పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలనే డిమాండ్, డి ఎస్ సి, నియా మకాల్లో అవకతవకలు, స్థానిక ప్రజా సమస్యలు, తెలుగుదేశం ప్రజా ప్రతినిధుల అవినీతి తదితర అంశాలపై తమ గళాన్ని బలంగా వినిపించి కార్యక్రమ విజయవంతనికి సహకరించాలని పార్టీ శ్రేణులకు శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

**తొండూరు - సూర్య వాస్తవం:** తొండూరు గంగాదేవిపల్లె గ్రామా నికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెద్ద గంగిరెడ్డి మృతి చెందగా, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీ సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ. 5,00,000 ఆర్థిక సహాయ చెక్కును ఆయన సతీమణి తులశమ్మ కి తొండూరు మండల టీడీపీ ఇన్‌చార్జ్ శివ మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శివ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ సంప్రదాయమని తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి నాయకత్వంలో, పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కంచిరెడ్డి, సుబ్బా రెడ్డి, నాగఅంజనేయలు రెడ్డి, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా గ్రామ పెద్దమ్మ జాతర

**- జాతర మహోత్సవంలో పాల్గొన్న వైసిపి నాయకులు**

**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన పెద్దమ్మ స్వామి జాతర మహోత్సవం భక్తి శ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. కల్లూరు గ్రామ వైఎస్సార్సీపీ నాయకుడు చిదంబర రెడ్డి ఆహ్వానం మేరకు వైఎస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రటరీ శ్రీ బొమ్మన శ్రీ రామిరెడ్డి, శింగనమల నియోజక వర్గ వైఎస్సార్సీపీ మాజీ సమన్వయ కర్త ఎం. వీరాంజ నేయులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు.గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పెద్దమ్మ జాతరలో ప్రజలతో మమేకమై వారి ఆనందాల్లో భాగస్వాములవుతూ వైసీపీ నాయకులు పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నాయకులకు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ముచ్చుకోట శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి నాగరాజు, రామకృష్ణ, తిరుపతయ్య, రమణ రెడ్డి, వైఎస్ఆర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇండియా కూటమి సభ విజయవంతం

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె – సూర్య వాస్తవం:** కాంగ్రెస్ నేతృత్వంలో ఢిల్లీలో నిర్వహించిన ఇండియా కూటమి సమావేశం విజయ వంతమైందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమిలోని పలు రాజకీయ పార్టీల నాయకులు సమావేశంలో పాల్గొని దేశంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై చర్చించారని తెలిపారు.

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడడం, పార్లమెంటులో సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తు ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కూటమి సమిష్టిగా పనిచేస్తుందని, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. 2029 ఎన్నికలపై కూడా ఆయన తన రాజకీయ అంచనాలను



వ్యక్తం చేశారు.

**రైతు సమస్యలపై స్పందన**

రాష్ట్ర ప్రభుత్వం రైతు అనుకూలంగా పనిచేస్తోందన్న వ్యాఖ్యలను తులసి రెడ్డి ఖండించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, ఎరువుల ధరల నియంత్రణ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీలు వంటి అంశాల్లో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని కోరారు. వ్యవసాయ రంగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవాలని, రైతు రుణమాఫీ అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆయాపై కుల వివక్ష

## - అక్రమ తొలగింపునకు కుట్ర!

**దువ్వూరు –సూర్య వాస్తవం :** వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని దువ్వూరు మండలం, పుల్లారెడ్డిపేట గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత 25 సంవత్సరాలుగా ఆయాగా నిష్కళంక సేవలు అందిస్తున్న జె. సుశీలమ్మ (ఐడి: ఎస్ డబ్ల్యూ 200500816003) అనే దళిత మహిళపై కుల వివక్షతో అక్రమ తొలగింపునకు కుట్ర జరుగుతోందని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. గత 2001వ సంవత్సరంలో నాటి హెచ్ఎం అహల్యాబాయ్, స్కూల్ కమిటీ తీర్మానం మరియు ఆదేశాల మేరకు నిరుపేదరాలైన సుశీలమ్మను పాఠశాల ఆయాగా నియమించగా, నాటి నుండి నేటి వరకు పాఠశాల పరిసరాలను ఎంతో పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు నిరంతర సేవలు అందిస్తోంది. తనకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు మొత్తం ఐదుగురు సంతానం ఉన్నారని, కేవలం తాను చేసుకునే ఈ ఆయా ఉద్యోగంపై వచ్చే అరకొర జీతం పైనే తన కుటుంబం అంతా ఆధారపడి బతుకుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, గత కొద్ది నెలలుగా ప్రస్తుత హెచ్ఎం మరియు డిప్యూటీ డీఈఓ అయినటువంటి రాజగోపాల్ రెడ్డి, పాఠశాల రికార్డ్ అసిస్టెంట్ చక్రపాణిలు కావాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తూ సుశీలమ్మను విధుల నుండి తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. దళిత మహిళ అనే ఒకే ఒక్క కారణంతో ఆమెపై తీవ్రమైన కుల వివక్ష చూపిస్తూ, ఆమెను ఎలాగైనా తప్పించి, ఆ స్థానంలో హెచ్ఎం తన సొంత సామాజిక వర్గానికి చెందిన ఒక అగ్రవర్ణ మహిళను నియమించుకోవడానికి స్థానిక నాయకులతో కలిసి




తెరవెనుక రాజకీయాలు నడుపుతున్నారని బాధితురాలు ఆరోపించింది.

ఇందులో భాగంగానే సుశీలమ్మ సంతకం చేసే హాజరు రిజిస్టర్ బుక్కును హెచ్ఎం రాజగోపాల్ రెడ్డి ఏకంగా తన ఇంట్లోనే పెట్టుకుని, ఆమెకు సంతకం చేసే అవకాశం ఇవ్వకుండా, గత కొన్ని నెలలుగా జీతం కూడా రాకుండా తీవ్ర ఆకలి కేకల వైపు నెట్టేస్తున్నారు. ఇంతటి అన్యాయంపై ప్రశ్నిస్తే ఆమెకు "మతిభ్రమించింది", "లేనిపోనివి ఊహించుకుంటోంది" అంటూ పై అధికారులకు నిస్సిగ్గుగా తప్పుడు సమాచారం ఇస్తూ ఆమెను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఈ అన్యాయాన్ని తట్టుకోలేక బాధితురాలు ఇప్పటికే పిజిఆర్ఎస్ (స్పందన) ద్వారా జాయింట్ కలెక్టర్ ని, జిల్లా విద్యాశాఖాధికారి ని కలిసి మొరపెట్టుకోవడమే కాకుండా, మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ని కూడా నేరుగా కలిసి తన కుటుంబ దీన పరిస్థితిని చెప్పుకొని కన్నీరు మున్నీరైంది. దీంతో తీవ్ర కక్ష పెంచుకున్న రికార్డ్ అసిస్టెంట్ చక్రపాణి, పాఠశాల సెలవు దినాలలో సైతం ఆమెపై దౌర్జన్యానికి దిగి, "మాపైనే జేసీ కి, ఎమ్మెల్యేకు కంప్లైంట్ చేస్తావా?" అంటూ నానా దారుణమైన మాటలతో దూషిస్తూ, ఉద్దేశపూర్వకంగా ఉద్యోగం నుండి తొలగించే దురుద్దేశంతో ఆమె ఇంటికి అక్రమంగా ఒక నోటీసును కూడా అంటించి బెదిరింపులకు గురిచేశారు. ప్రభుత్వ అధికారిక ఆన్‌లైన్ రికార్డులలో ఇప్పటికీ 'జె. సుశీలమ్మ' పేరే ఆయాగా స్పష్టంగా చలామణి అవుతున్నప్పటికీ, స్థానిక అధికారులు మాత్రం దళిత మహిళను బతుకనివ్వకుండా, ఆమె పొట్టకొట్టేలా అరాచకాలు సాగిస్తున్నారు. తమ కుటుంబానికి ఎలాంటి ఆదరణా లేదని, ఈ ఉద్యోగమే తన పిల్లల ప్రాణాధారమని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే విచారణ జరిపి కుల వివక్షకు పాల్పడుతున్న సదరు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు ఆయా ఉద్యోగాన్ని కాపాడి న్యాయం చేయాలని సుశీలమ్మ చేతులు జోడించి దీనంగా వేడుకుంటోంది.

# పల్లెల ప్రగతికి తొలి ప్రాధాన్యం

## - జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ

**అనంతపురం– సూర్య వాస్తవం:** పల్లెల ప్రగతే తొలి ప్రాధాన్యంగా భావించి.. పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తేనే అనంతను అగ్రస్థానంలో నిలపగలమని ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మీ అన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు గుర్తెరిగి తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ ఆవరణలో గల డీపీఆర్సీ భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎంపీడీఓలు, అనంతపురం జిల్లా డిప్యూటీ ఎంపీడీఓలు హాజరయ్యారు. డీపీఓ నాగరాజానాయుడు, డీడీఓలు తేజోష్ణ, కొండన్న, యోగానందరెడ్డి, డీఎల్పీఓ విజయకుమార్ హాజరయ్యారు. సీఈఓ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చి, అందులో చాలా మార్పులు, చేర్పులు చేసిందన్నారు. వాటిని ఆకళింపు చేసుకొని గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు.

కీలకమైన శిక్షణ తరగతులను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓల పాత్ర చాలా కీలకమన్నారు. అయితే కొందరు సమర్థవంతంగా పని చేస్తుండగా, మరి కొందరు కార్యాలయాలకు సక్రమంగా హాజరు కావడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. క్యాంపుల పేరుతో సాకులు చెప్పి విధులకు హాజరు కాకపోవడం క్షమించరానిదన్నారు. అటువంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్లు నిర్వహించే కాన్ఫరెన్స్ లను కూడా కొందరు సీరియస్ గా తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే కుందుర్పి ఎంపీడీఓ వ్యవహార శైలిని ప్రస్తావిస్తూ.. అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు సీఈఓ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలు సిద్ధమవుతోందన్నారు.

ఈ విషయాన్ని మిగిలిన వారు కూడా సీరియస్ గా తీసుకొని మసలుకోవాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఆదేశాలు, ఆలోచనలకనుగుణంగా ప్రతి అధికారి పని చేయాలని పేర్కొన్నారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.



# నూతన తహశీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



**వేంపల్లె – సూర్య వాస్తవం:** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ జిల్లా శివ శంకర్ రెడ్డి ను స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ ఎస్ ఎండి షబ్బీర్, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి( దిల్ మాంగే) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందు తాయని పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్‌కు అభినందనలు తెలియజేసి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, యం. గంగాధర్, మహమ్మద్ అలీ ( సెట్ ) ఇమ్రాన్, మంజు, నరసింహ, ఖాసీం వల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ యువ నాయకుడు సింగారెడ్డి జయశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డి కుమారుడు, టీడీపీ యువ నాయకుడు సింగారెడ్డి జయశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు వేంపల్లెలో ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన స్వగృహంలో అభిమానులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో జయశంకర్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం అభిమానులు ఆయనకు కేక్ తినిపించి శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేస్తూ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసా గిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న జయశంకర్ రెడ్డి చేసిన సామాజిక సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా అభిమానులు కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజాసేవలో రాణించాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షులు కొండూరు చైతన్య కుమార్, సింగారెడ్డి సాయి కృష్ణా రెడ్డి, కమటం హరికుమార్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్, నిరంజన్ రెడ్డి, రాముడు, లక్ష్మణ్, చంద్రా యుడు, శ్రీకాంత్, కిట్టూ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణదారులు ఏపీఏఐఎంఎస్ ద్వారా ఎరువులు అమ్మకం చేయాలి

## - సింగనమల వ్యవసాయ శాఖ అధికారి



**శింగనమల– సూర్య వాస్తవం :** సింగనమల మండలం లోని రైతుల కు 8–6–26 తేదీ నుండి ఎరువుల విక్రయ కేంద్రాలలో యూరియా, డిఏపి ఎరువులు ఏపీ ఏఐఎంఎస్ వెబ్సైటు ద్వారా మాత్రమే అమ్మకాలు జరుగును. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం ) వెబ్ సైట్‌లో ఎరువుల విక్రయదారులు రైతు యొక్క ఆధార్ ఎంటర్ చేయగానే, రైతు వారి సర్వే నంబర్లలో సాగులో ఉన్న పంటల వివరాలు చూపబడతాయి. ఆ పంట కు యూరియా, డిఏపి ఎంత మోతాదు అవసరమో కూడా అందులోనే చూపబడును. మొదటి డోసు, రెండవ డోస్‌లలో యూరియా, డిఏపి ఆయా పంటలకు అందించ వలసిన మోతాదు కూడా అందులోనే చూపబడును. ఆ మొతాదు ప్రకారం మాత్రమే, రైతుకు ఎరువులు విక్రయించ బడును. రైతుల పేర్లు లేని యెడల వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించూకోగలరు. ఎరువుల కొనుగోలు కి వెళ్ళునపుడు రైతు తమ వెంట ఆధార్, ఆధార్ కి అనుసంధానం అయినా మొబైల్ వెంట తీసుకొని వెళ్ళవలెను. ఎరువుల దుకాణ దారులు అందరూ కేవలం ఏపీ ఏఐఎంఎస్ ద్వారా మాత్రమే యూరియా, డిఏపి ఎరువులు అమ్మకాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. అలా అమ్మకాలు జరగని పక్షంలో ఎరువుల లైసెన్స్ సస్పెండ్ చేయబడును అని అన్నారు. ఈ విధానం వలన పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు, ప్రతి విస్తీర్ణానికి ఎరువులు పారదర్శకంగా అందింపబడును. మండలంలోని ప్రతి రైతులు అందరూ ఈ విధానాన్ని అవగాహనా చేసు కోవాలని, వ్యవసాయ అధికారి తెలియజేశారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

## - గాంధీ విగ్రహం ముందు డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి గుండు గీయించుకుని నిరసన




**డోన్ - సూర్య వాస్తవం:** డోన్ పట్టణంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్కీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కుకేటాయించాలి.నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలను తగ్గించి రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలి పెట్రోల్ -- డీజిల్ -- గ్యాస్ ధరలు తగ్గించిప్రజలపై ఇంధన భారాలు మోపొద్దు, కేజీ బేసిన్ సంపదపై ఆంధ్రప్రదేశ్‌కు హక్కు కల్పించాలి, ఉత్పత్తి అయ్యే చమురు --గ్యాస్‌లో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు రద్దుచేయాలి, ధరల పెరుగుదలపై ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీయం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ శ్రీడిమాండ్ చేశారు. --కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్,నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని, రాష్ట్రంలోని కృష్ణా–గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజవాయువులో 50 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం డోన్ పట్టణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ ప్రజలకు గుండు కోరుతున్నాయని గాంధీ విగ్రహం ముందు డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి గుండు గీయించుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులు, మహిళలు, యువజనులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్,మండల కార్యదర్శి రామాంజనేయులు, కమిటీ సభ్యులు నాగమద్దయ్య, షేమిమ్ బేగం, శ్రీనివాసులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన సమస్యలను పూర్తిగా విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించకుండా ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరల ఆకాశాన్నంటు తున్నాయని, పేదలు, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. రైతులకు సాగు ఖర్చులు పెరిగిపోయాయని, రవాణా రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోని కృష్ణా–గోదావరి బేసిన్‌లో భారీ స్థాయిలో చమురు, సహజవాయువు ఉత్పత్తి అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రజలకు దాని ప్రయోజనాలు అందడం లేదన్నారు. రాష్ట్ర సంపదపై రాష్ట్ర ప్రజలకు హక్కు ఉండాలని, కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌లో కనీసం 50 శాతం రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, నిరసనలు తెలిపినా ప్రభుత్వాలు స్పందించకపోవడంతోనే జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన కు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెంచిన ధరలను తగ్గించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే రానున్న రోజుల్లో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు,అశోక్, శ్రీను, రాము, బీబీ, మదన గోపాల్, డేవిడ్, సుబ్బారాయుడు, సుంకన్న, షాబాన,లతో పాటు కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**పామిడిలో...** పామిడి మండల కేంద్రంలో పెట్రోల్,డీజల్,గ్యాస్,వంట నూనెలా అధిక



రేట్లు పెంపుదలను కేంద్ర, రాష్ట ప్రభుత్వాల నిర్లక్ష్యాన్నీ నిరశిస్తూ వామపక్ష పార్టీలు తలపెట్టిన కార్యక్రమంలో ఐక్య మాదిగ సమాజ్, ఐ ఎం ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించి క్రొత్త బస్టాండ్ నుంచి బీసీ రోడ్డు గుండా అంబేద్కర్ విగ్రహం దగ్గరకు చేరుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, రోడ్డు పై భైటాయిస్తూ నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంతకల్లు నియోజకవర్గ బాధ్యుడు శ్రీనివాసులు మండల కార్యదర్శి కె. మల్లేష్ ఐఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంకరాజుకాలువ వెంకటేసు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రహమ్, మండల కార్యదర్శి నాగరాజు, సిపిఐ ఎంఎల్ నాయకులు దస్తగిరి సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి ఎదురూరు ముత్యాలు జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ మహిళా నాయకురాళ్ళు సర్దాన్, హుసేన్ భీ, దస్తగిరమ్మ, నూరరుఘాహాన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**గుత్తిలో...** గుత్తి గాంధీ సర్కిల్లో మంగళవారం పెద్ద ఎత్తున సిపిఐ, సిపిఎం వామపక్ష



పార్టీల ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ పెంచిన ధరలను ఉప సంహరించు కోవాలని రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు గుత్తి గాంధీ సర్కిల్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వ హించడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల ను ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై మోపుతున్న నిత్యవసర వస్తువులు పప్పు ధర ఉప్పుదరా నూనెలు ఇవన్నీటి పైన కూడా ధరలు విపరీతంగా పెంచేశారు మరి కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి మం చి పనులు ఏంటో ప్రజలు తెలుసుకోవాలా బిజెపి పెట్టుబడిదా రులకు మరి ఆదాని అంబానీ రిల యన్స్ పెద్దపెద్ద బడా బాబులకు అంత కూడా ఈ దేశ సంపదను ధారా దత్తం చేస్తూ ప్రజల ప్రజలను మాత్రం నడ్డి ఇరుస్తున్నారు. మరి ఈ ప్ర భుత్వాన్ని గద్దె దింపాలంటే లౌకిక శక్తులు వామపక్ష పార్టీలు ఏకమై ఈ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దిం పడానికి అందరూ కూడా సిద్ధం కా వాలని వామపక్ష పార్టీలుగా డిమాం డ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో సి పిఐ మండల కార్యదర్శి రామదాసు సిపిఎం మండల కార్యదర్శి నిర్మలఆ ధ్వర్యంలో నిర్వహించడం జరిగింది సిపిఐ పట్టణ కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి నజీర్ మహమ్మదా, మండల నాయకులు మధు, మండల సిపిఎం కమిటీ సభ్యులు రేణుక మ్మ,రామకృష్ణ, మల్లేష్, మల్లికార్జున, రమేష్,నవీన్ యాదవ్, చందు, ఊర్మిళ పొన్నూరు అమ్మ మారి సుజాత, గౌరమ్మ, సిపిఐ సీనియర్ నాయకులు డానియల్ రామకృష్ణ, షఫీ, శివ కుమార్, గోపాల్, వెంకటేష్, తదిరులు పాల్గొన్నారు.

## గడువులోగా పనులన్నీ పూర్తి చేయండి

### - పీఆర్ ఎస్ఈ వై.చిన్నసుబ్బరాయుడు



**అనంతపురం– సూర్య వాస్తవం:** జిల్లా వ్యాప్తంగా నిర్మాణాల్లో ఉన్న పంచాయతీ కార్యాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలను సత్వరం పూర్తి చేయాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వై.చిన్నసుబ్బరాయుడు ఆదేశించారు. జిల్లాలోని డీఈఈలు, ఏఈఈలతో అనంతపురంలోని పీఆర్ జిల్లా కార్యాలయంలో గల తన చాంబర్ లో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఈలు కె. లక్ష్మీనారాయణ, జింకల కృష్ణజ్యోతి, డీఎల్ మురళీ, రాజన్న, సుధాకర్ నాయక్, యల్లమనాయుడు, రసూల్, గురుమూర్తి, ఈఈ పీఏ విజయశేఖర్, ఏఈఈలు వెంకటశేషయ్య, కిశోర్, రవీంద్ర, నరేంద్ర, అమర్నాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. మండలాల వారీగా చేపట్టిన భవన నిర్మాణాల గురించి ఆరా తీశారు. నెలన్నరలోగా వాటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా అమలు చేయనున్న హథీ రాం జీ ఉపాధి హామీ పథకం గురించి కూడా వివరించారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మొలకలచెరువు నూతన తహసీల్దార్ బి.రెడ్డెన్న

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** మొలకలచెరువు నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. రెడ్డెన్న మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.రెడ్డెన్న జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొలకలచెరువు మండల పరిధిలోని రెవెన్యూ శాఖ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు,జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



## వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

- అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి
- రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తలనాలు అందించి ఆదుకోవాలి
- మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడండి..




**వేముల - సూర్య వాస్తవం :** మండల పరిషత్ సమావేశ సభ భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. స్థానిక ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జడ్పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారుల ను నిలదీశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వెంకట బయపురెడ్డి మాట్లాడుతూ, అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు బట్టారు.వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తలనాలు అందించి ఆదుకోవాలని వ్యవ సాయ శాఖ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఏ శివలక్ష్మి,డిప్యూటీ ఎంపీడీవో కుమార్ రంగయ్య, కృష్ణయ్య, ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డి, ఏఈ అబ్దుల్లా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

- ప్రకృతి వ్యవసాయ ప్రచార కరదీపికల ఆవిష్కరణ
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఎల్ నిన్యో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ 2026-27 ప్రచార కరదీపికలను మంగళవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు వాతావరణ మార్పులు, పంటల నిర్వహణ, నీటి వినియోగం, మిశ్రమ పంటలు, జీవ ఉత్ప్రేరకాల వినియోగం వంటి అంశాలపై సమయానుకూలంగా అవగాహన కల్పించడం అవసరమన్నారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుల ద్వారా ఈ కరదీపికలను రైతులకు అందించి విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం విశ్లేషించి రైతులకు శాస్త్రీయ, ఆచరణాత్మక సూచనలు అందించాలన్నారు. డిజిటల్ వేదికలు, మొబైల్ యాప్‌లు, ఎస్ఎంఎస్, వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా వ్యవసాయ సలహాలు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పకృతి వ్యవసాయం, తేమ సంరక్షణ, నీటి నిర్వహణ, దేశవాళీ విత్తనాల వినియోగం, మిశ్రమ పంటల సాగు ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి. శివన్నారాయణ, సమాచార శాఖ ఏడి సీహెచ్. పురుషోత్తం, వ్యవసాయ శాఖ ఏవో నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివాదాస్పద సన్నివేశాలు తొలగించాం

## - పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు వెల్లడి



'పెద్ది'లో వివాదాస్పదమైన సన్నివేశాలను తొలగించినట్లు దర్శకుడు బుచ్చిబాబు వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ ఇందులోని కొన్ని సన్నివేశాలపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల క్షమాపణలు చెప్పిన బుచ్చిబాబు ఆయా సన్నివేశాలను తొలగిస్తామని చెప్పారు. వాటిని తొలగించినట్లు తాజాగా తెలిపారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఇలాంటి మంచి కథలో జాన్వీ కపూర్ ట్రాక్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. సినిమాకు ఆ పాత్ర అనవసరమని కామెంట్ చేశారు. నా గత సినిమాతో (ఉప్పెన) పోలిస్తే 'పెద్ది' కథను నేను పూర్తి భిన్నంగా రాసుకున్నా. కొండల ప్రాంతంలో మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తి పెద్ది. మొదట అతడిలో మొరటుతనాన్ని చూపించి.. సినిమా చివరిలో దాన్ని సరిదిద్దాలని భావించాను. అతడు పెరిగిన వాతావరణం వల్ల అలా ఉన్నాడని.. అతడు మారడానికి అమ్మాయి ప్రేమ కూడా ఓ కారణం కావాలని ఆమె పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలో కొన్ని సన్నివేశాలు అపార్థానికి దారితీశాయి. దీంతో అందరూ ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకున్నారు. విడుదల అనంతరం వచ్చిన విమర్శలను మేం పరిగణనలోకి తీసుకున్నాం. ఆ సన్నివేశాలను గుర్తించి సినిమా నుంచి తొలగించాం అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పించారు.

ఆయనకు జోడీగా జాన్వీకపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. ఆమె పాత్రను గ్లామర్‌కే పరిమితం చేశారని పరిచయ సన్నివేశాల్లోనూ ఆమెను చూపిన విధానంపై విమర్శలు వచ్చాయి. ఈ వివాదం పక్కన పెడితే జూన్ 4న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకూ రూ.315 కోట్లు రాబట్టింది. అయితే, ఈ సినిమాలో జాన్వీ కపూర్ సీన్స్ తో పాటు సెకండాఫ్ లో కొన్ని పాత్రల ఎండింగ్ సరిగా లేదని కొద్దీ రోజులుగా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చిత్ర బృందం ఈ సినిమాలో కొన్ని కీలక మార్పులు చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం..

'పెద్ది' సినిమా లెంత్, అలాగే కొన్ని సీన్స్ విషయంలో వస్తున్న మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ కొన్ని సీన్లను డిలీట్ చేసి, మరికొన్ని కొత్త సీన్లను జత చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా సెకండాఫ్ లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ పోషించిన 'గౌరినాయుడు' ఎ÷-లాష్‌బ్యాక్ సీన్స్‌ను కొన్నింటిని తొలగించనున్నారట. ఈ సీన్స్ సినిమా ఎ÷-లోను కాస్త నెమ్మదించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అభిమానులకు సర్ప్రైజ్ ఇస్తూ రామ్ చరణ్, జగపతి బాబుల మధ్య ఉండే మరికొన్ని కీలకమైన సీన్లను యాడ్ చేయబోతున్నారట. ఈ మార్పులన్నింటినీ పూర్తి చేసిన తర్వాత చిత్ర యూనిట్ ఈ కొత్త వర్షన్‌ను మళ్లీ సెన్సార్ చేసి థియేటర్లలో పాత వర్షన్ ను తీసేసి, ఈ కొత్త వెర్షన్‌ను అప్‌లోడ్ చేయనున్నారు. ఈ సరికొత్త మార్పులతో ఫుట్ ఫాల్స్ పెరుగుతాయని టీమ్ భావిస్తోంది.

# కింగ్ నాగార్జున వందో మూవీ

## సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం



టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా ఉంటుంది? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. మరి కింగ్ 100తో నాగార్జున ఎలా ఎ÷-లాన్ చేస్తున్నాడో చూడాలి.



# గెలిపించిన బౌలర్లు

## - చివర్లో ఇండియా-ఎ సంచలనం

## - గైక్వాడ్ సెంచరీ, తిలక్ వర్మ అర్ధ సెంచరీలు

దంబుల్లా: శ్రీలంక పర్యటనలో భారత్-ఎ జట్టు సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. 278 పరుగుల ఛేదనలో శ్రీలంక-ఎ 6వికెట్ల నష్టానికి 262 పరుగులతో గెలుపుకు చేరువైన జట్టును ఇండియా-ఎ బౌలర్లు ఫలితం తారు మారు చేశారు. టీమిండియా-ఎ బౌలర్లు ఒక్కసారిగా చెలరేగడంతో లంకజట్టు మరో 7పరుగుల్లోపే చివరి 4 వికెట్లు కోల్పోయి ఆలౌట్ కాగా.. ముక్కోణపు టోర్నీలో టీమిండియా బోణీ కొట్టింది. డంబుల్లా వేదికగా శ్రీలంక-ఏతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ 8 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ కు దిగిన భారత్.. బిరుతురాజ్ గైక్వాడ్ (101) సూపర్ సెంచరీకి తోడు కెప్టెన్ తిలక్ వర్మ (60) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీతో రాణించడంతో నిర్ణీత 50 ఓ?వర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆఖర్లో ఆయుశ్ బదోని (24), సూర్యాంశ్ షేడ్గే (26 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో రాణించారు. ఐపీఎల్ 2026 తర్వాత భారీ అంచనాలతో బరిలోకి దిగిన సూర్యవంశీ 14 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. లంక బౌలర్లలో మొహమ్మద్ షిరాజ్ 2 వికెట్లు తీయగా.. కరుణరత్నే, సంకేత్, వనుజ సహాన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, సాహన్ అరచ్చిగే (74), నిరోషన్ డిక్వెల్లా (47), సమరవిక్రమ (46) రాణించడంతో ఓ దశలో (262/6) గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే చివరి రెండు ఓవర్లలో (7 పరుగుల వ్యవధిలో) బికేవలం 10 పరుగులు అవసరమైన సమయంలో శ్రీలంక వరుసగా నాలుగు



వికెట్లు కోల్పోయి 269 పరుగులకే ఆలౌటై, ఓటమిపాలైంది. అర్షద్ ఖాన్, ఆయుష్ బదోని, అనుకూల్ రాయ్, విప్రాజ్ నిగమ్ తలో రెండు వికెట్లు తీయగా, అన్షుల్ కంబోజ్ ఓ వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గైక్వాడ్ కు దక్కింది. 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్-ఏ, ఆఫ్ఘనిస్తాన్-ఏ తలపడనున్నాయి.బి స్కోర్ బోర్డు...

ఇండియా-ఎ ఇన్నింగ్స్: ప్రభ్ సిమ్రన్ సింగ్ (సి)సమరవిక్రమ (బి)కరుణరత్నే 2, సూర్యవంశీ (సి)సహన్ (బి)షిరాజ్ 14, ప్రియాన్ష్ ఆర్యా (రనౌట్)ఫెర్నాండో/డిక్వెల్లా 32, గైక్వాడ్ (సి)ఫెర్నాండో (బి)సహన్ 101, తిలక్ వర్మ (బి)షిరాజ్ 60, ఆయుస్ బడోనీ (ఎల్ బి)గరుక సంకేత్ 24, సుయాన్ష్ షిండే (నాటౌట్) 26, అనుకుల్ రాయ్ (నాటౌట్) 1, అదనం 17. (50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 277 పరుగులు.

వికెట్ల పతనం: 1/16, 2/16, 3/69, 4/219, 5/225, 6/271

బౌలింగ్: కరుణరత్నే 7-1-46-1, షిరాజ్ 9-0-67-2, సంకేత్ 8-0-49-1, ఫెర్నాండో 8-0-38-0, వనుజ సహాన్ 10-0-35-1, సహన్ అరఛింగే 4-1-18-0, విశ్వకాంత్ 4-0-23-0

శ్రీలంక-ఎ ఇన్నింగ్స్: డిక్వెల్లా (సి)అనుకుల్ రాయ్ (బి)బడోనీ 47, ఫెర్నాండో (సి)సూర్యవంశీ (బి)బడోనీ 45, నువాందు ఫెర్నాండో (స్టంప్)ప్రభ్ సిమ్రన్ సింగ్ (బి)విప్రాజ్ 8, సదీరా (సి)సుయాంశ్ షిండే (బి)అనుకుల్ రాయ్ 46, సహన్ (బి)కంబోజ్ 74, రవీందు (సి అండ్ బి)అనుకుల్ రాయ్ 1, ఛమీకా (సి)బడోనీ (బి)విప్రాజ్ 9, వనుజ (రనౌట్)గైక్వాడ్ 23, విజయ్ కాంత్ (ఎల్ బి)అర్షాద్ 5, షిరాజ్ (సి)విప్రాజ్ (బి)ఆర్షాద్ 0, సంకేత్ (నాటౌట్) 0, అదనం11. (48.5ఓవర్లలో ఆలౌట్) 269 పరుగులు.

వికెట్ల పతనం: 1/93, 2/99, 3/109, 4/187, 5/195, 6/237, 7/262, 8/269, 9/269, 10/269

బౌలింగ్: కంబోజ్ 6-0-47-1, అర్షాద్ ఖాన్ 4.5-0-24-2, అనుకుల్ రాయ్ 10-1-49-2, సుయాంశ్ షిండే 8-0-41-0, బడోనీ 10-0-46-2, విప్రాజ్ 8-0-46-2, తిలక్ 2-0-15-0.



# 48 జట్లతో ఇదే తొలిసారి

### ఫిఫా ప్రపంచకప్

న్యూయార్క్: ఫిఫా ప్రపంచకప్ ఈనెల 12నుంచి ప్రారంభం కానుంది. అమెరికా, మెక్సికో, కెనడా ఆతిథ్యమిచ్చే ఈ మెగా టోర్నీ (జూన్ 11న) గురువారం అర్ధరాత్రి 12.30 గం॥లకు మెక్సికో, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్ తో 23వ ఫిఫా ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో తొలిసారి 48జట్ల మధ్య 2026 టైటిల్ సంగ్రామం జరగనుంది. ఇంతకుముందు వరకు కేవలం 32 జట్లకే పరిమితమై జరిగే ప్రపంచ ప్రఖ్యాత క్రీడ ఫుట్ బాల్ సంగ్రామం తొలిసారి 48జట్లకు పెంచడం జరిగింది. 2022 ఫిఫా ప్రపంచకప్ కు ఆతిథ్యమిచ్చిన ఆసియా ఖండ దేశం ఖతార్ టోర్నీ టైటిల్ ను లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా గెలుచుకొని చరిత్ర సృష్టించింది. ఫైనల్లో ఆ జట్టు పటిష్ట ఫ్రాన్స్ ను ఓడించిన తీరు వర్ణణా తీతం. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 1-1 గోల్స్ తో సమంగా ఉండగా.. అదనపు సమయం అర్జెంటీనా, ఫ్రాన్స్ మరో 2 గోల్స్ చేశాయి. దీంతో షూటౌట్ కు దారితీయగా.. అర్జెంటీనా 4-2తో ఫ్రాన్స్ ను ఓడించి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఫ్రాన్స్ స్ట్రయికర్ ఎంబపే 8 గోల్స్ కొట్టి గోల్డెన్ బూట్ ను దక్కించుకున్నాడు. ఈ టోర్నీ చరిత్రలో బ్రెజిల్ కు తిరుగులేని రికార్డు ఉంది. ఆ జట్టు ఏకంగా ఐదుసార్లు ఈ టైటిల్ ను కైవసం చేసుకొంది. కానీ ఇటీవలి కాలంలో ఆ జట్టు ఆశించిన స్థాయిలో రాణించ లేకపోతోంది. ముఖ్యంగా నాకౌట్ లో ఓటమిపాలై సాంబా అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఇటలీ జట్టు గత రెండు ప్రపంచకప్ లకు కనీసం అర్హత సాధించలేకపోతోంది. ఇది సగటున ప్రతి ఒక్క ఇటలీ అభిమానిని మరింత కలచి వేస్తోంది. గ్రూప్ లు... ఎ : మెక్సికో, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, చెక్ రిపబ్లిక్ బి: కెనడా, బోస్నియా అండ్ హెర్జెగోవినా, ఖతార్, స్విట్జర్లాండ్ సి : బ్రెజిల్, మొరాకో, హైతీ, స్కాట్లాండ్ డి : అమెరికా, పరాగ్వే, ఆస్ట్రేలియా, టర్కీ ఇ : జర్మనీ, కురాకో, ఐవరీ కోస్ట్, ఈక్వెడార్ ఎఫ్ : నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, ట్యూనీషియా జి: బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్. హెచ్ : స్పెయిన్, కాబోవెర్డే, సౌదీ అరేబియా, ఉరుగ్వే ఐ : ఫ్రాన్స్, సెనెగల్, ఇరాక్, నార్వే జె : అర్జెంటీనా, అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్ కె : పోర్చుగల్, డిఆర్ కాంగో, ఉజ్బెకిస్తాన్, కొలంబియా ఎల్: ఇంగ్లండ్, క్రొయేషజయా, ఘనా, పనామా

# వెన్నుపోటుకు రెండేళ్లు: ప్రజాసంఘాల తీవ్ర ధ్వజం!

## అబద్ధపు హామీలతో ప్రజలను వంచించిన చంద్రబాబు

**ఉరవకొండ – సూర్య వాస్తవం :** చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా, ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలు అమలు కాలేదని ప్రజాసంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు నిర్వహించిన 'ప్రజాసంఘాల చర్చవేదిక'లో ప్రభుత్వ వైఫల్యాలపై నాయకులు ఘాటుగా స్పందించారు. మేనిఫెస్టో అమలు శూన్యం.. అంతా మోసపూరితం!?సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకోవడానికి సాధ్యం కాని మోసపూరిత హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించారని మండిపడ్డారు. నమ్మి ఓట్లేసిన ప్రజల వెన్నుపోటు పొడవడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. రెండేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి ఏమీ లేదని, నిరుద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం పదవిలో ఉండటానికి అర్హత లేదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ఎలాంటి నైతిక అర్హత లేదని చర్చవేదిక ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉరవకొండ వైస్సార్సీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, మేనిఫెస్టోలోని ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని, హెచ్చరించారు. అసలు ఈరోజు ప్రజలలోనే కాదు కూటమి భాగస్వామ్యంలోనే మా పని అయిపోయిందని భావన పెరిగిపోయిందేమో తమ పాలన పట్ల ప్రజలకు విశ్వాసం పోయినట్లు అనిపిస్తావుంది. ప్రజలకు నా అసలు కల్పించినారు అందుకే వాళ్ళ విజయం నిజమైన విజయం కాదని అది ఒక మోసపూరిత ఈవీఎంలపై వచ్చిన ఆరోపణలు చెప్పుకోలేకపోతున్నారు వాళ్ళు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టి ఈరోజు విద్యార్థుల్లో ఉద్యోగులలో మహిళలలో చాలా పెద్ద ఎత్తున




రైతాంగంలో ఈ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేకపోయింది అంతేకాకుండా ప్రజలకు ఏమి ఇవ్వకపోగా ఈరోజు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసింది అదే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో మూడు లక్షల 50 వేల కోట్లు అప్పుచేసి దానిలో రెండు లక్షల 85 వేల కోట్ల రూపాయలు సంక్షేమం రూపంలో ప్రజలకి ఇచ్చింది.

పేద మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది ఆ రోజుల్లో జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఉందని ధీమా ప్రజల్లో కల్పించారు ఆరోజు పేద ప్రజల ఆరోగ్యానికి గాని పిల్లల విద్యకు గాని ఎటువంటి డోకా లేదు మహిళా సంఘాలకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 18 వేల రూపాయలు ఇచ్చాము అని విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు అలాగే చంద్రబాబు ఎగ్గొట్టిన డ్వాక్రా సంఘాల అప్పులు 25 వేల కోట్ల రూపాయలు మహిళలకు చెల్లించినాము ఈరోజు నీ వర్గాల ప్రజలు చంద్రబాబు మాటలు తప్ప పని చేయడం లేదు అని అసంతృప్తిగా ఉన్నారు. ఈ ప్రభుత్వం కష్టజీవుల పేదల రైతుల ప్రభుత్వం కాదని వారి విధానాల వల్ల అర్థమవుతుంది ఈ ప్రభుత్వం కార్పొరేట్ ధనవంతులు ప్రభుత్వంగా కనిపిస్తా ఉంది. ఈ ప్రభుత్వములో పేద పిల్లలకు విద్యాదేవన రైతులకు సంవత్సరానికి 20వేల, మహిళలకు 18వేల, నిరుద్యోగ భృతి ఇస్తామన్న కార్యక్రమం ఎక్కడ అమలు కు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. అందుకే చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని రాష్ట్రంలోని ప్రజలందరూ బలంగా నమ్ముతున్నారు. అయినప్పటికీ చంద్రబాబు తనకు తాను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రాదని అందుకనే ప్రజల సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి మీద దృష్టి పెట్టకుండా ఈరోజు జగన్మోహన్ రెడ్డి మీద బురద జల్లడం జగన్ అంటే హింస రాజకీయాలు ప్రోత్సహించే వ్యక్తిగా ముద్ర వేయడానికి నిరంతరం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు సుప్రీంకోర్టు చెప్పింది వివేకానందరెడ్డి కేసులో భారతీ పేరు పెట్టడానికి ఏమీ లేదని చెప్పింది. అయినా కూడా జగన్ వాళ్ళ చినాన్నని వెన్నుపోటు పొడిచాడని ప్రచారం చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని శవిశ్వేశ్వరరెడ్డి అన్నాడు. జగన్ పరిపాలలో మానవత్వం కనిపించింది పేద ప్రజల సంక్షేమం గురించి ఆలోచించి రాష్ట్రవ్యాప్తంగా లక్షల మందికి ఇల్లు కట్టించినాడు ఉరవకొండ లోని వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చినాము అని అన్నారు వైఎస్ఆర్సిపి నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు దించిన మానవతా ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డిది అన్నారు. వైఎస్ఆర్సిపి పార్టీని గొడ్డలి పార్టీ అని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు చంద్ర బాబు పచ్చ మీడియాను అడ్డుపెట్టుకొని జగన్మోహన్ రెడ్డిని ఒక క్రిమినల్ అని నిద్ర వేయడానికి ప్రయత్ని స్తున్నారని విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న, వైసీపీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా శక్తి యాప్ : జిల్లా ఎస్పీ

**- శక్తి యాప్ , స్త్రీరక్ష పోర్టల్ సేవలు**
**మహిళా రక్షణ చట్టాలపై చైతన్యం**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ ఆఫీస్ సమీపంలోని వ్యవసాయశాఖ గోదాములో మంగళవారం నాడు మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళలను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..... మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ముఖ్యంగా... గృహహింస, వేధింపులు, సైబర్ మోసాలు, బాల్య వివాహాల వంటి అంశాలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. శక్తి టీమ్ సేవలు, డౌన్లోడ్ మరియు విధివిధానాలు, స్త్రీరక్ష పోర్టల్ సేవలు గురించి మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీస్ స్టేషన్‌లో అందించే సేవల గురించి కూడా తెలియజేశారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టం వారికి పూర్తి రక్షణ కల్పిస్తుందన్నారు. కుటుంబ సామాజిక స్థాయిలో మహిళల భద్రతకు అందరూ బాధ్యత వహించాలని సూచించారు. మహిళలు ప్రయాణాల్లో లేదా కొత్త ప్రదేశాల్లో ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేధింపులు లేదా అసభ్య ప్రవర్తన ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోక్సో చట్టం,




ఆస్తి హక్కులు తదితర చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాల న్నారు. సైబర్ మోసాలులో భాగంగా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బ్యాంక్ వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకో కూడదని వివరించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలపై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని, సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని, తక్షణ సహాయం అందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, పుట్లూరు సి.ఐ సత్యబాబు, ఎస్ఐలు రామాంజనేయ రెడ్డి మరియు సురేంద్ర బాబు మరియు భారీగా మహిళలు, జీ ఎం ఎస్ కే లు, తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ మదన్ రాజు అకాల మరణం

**- రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఏఎస్పీ**

**తాడిపత్రి– సూర్య వాస్తవం :** రూరల్ పోలీస్ స్టేషన్ లో యూపీఎస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న మదన్ రాజు (తీవ్ర అనారోగ్యంతో) కన్నుమూశారు. ఆయన అ కాల మరణం పోలీస్ శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతి :** కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ?కానిస్టేబుల్ మదన్ రాజు అకాల మరణం పట్ల జిల్లా ఎస్పీ పి. జగదీష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన కానిస్టేబుల్ ను కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఎస్పీ పి. జగదీష్ రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ఈ నగదును జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాడి పత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మరణించిన కానిస్టేబుల్ మదన్ రాజు అంత్యక్రియలు పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో, ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



# ఎంపీడీఓల పనితీరు మెరుగుపడాలి

**- గ్రామ పంచాయతీ అభివృద్ధిపై**
**ఎంపీడీఓలకు శిక్షణ వేదికపై సీఈఓ విజయలక్ష్మి**

**అనంతపురం – సూర్య వాస్తవం:** అనంతపురంలోని డీ.పీ.ఆర్.సీ లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఎంపీడీఓలు హాజరయ్యారు. గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్రణాళిక రూపకల్పనపై ఒక రోజు శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కలెక్టర్ నిర్వహించే వీసీలను కొందరు ఎంపీడీఓలు ఆషామాషీగా తీసుకుంటున్నారని సీఈఓ విజయలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగానే కుందుర్పి ఎంపీడీఓపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైల్ సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. మిగిలిన ఎంపీడీఓలు కూడా జాగ్రత్తగా మసలుకోవాలని సూచించారు. చాలా మంది ఎంపీడీఓలు ఫీల్డ్ కు వెళ్ళడమే లేదని తమకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఉన్నతాధికారుల ఆలోచనలకు అనుగుణంగా పని చేయని ఎంపీడీఓలపై చర్యలు తప్పవన్నారు. డిపీఓ నాగరాజా నాయుడు, ఇంచార్జ్ డీడీఓలు కొండన్న, తేజ్యోష్ణ, ఇతర అధికారులు వేదికపై ఆశీనులయ్యారు.

# ఎస్ఐ సురేష్ చేతుల మీదుగా స్త్రీ రక్ష యాప్ ఆవిష్కరణ



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మండలం లచ్చానాపల్లె గ్రా మంలో మంగళవారం అర్బన్ సీఐ రామారావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు సైబర్ నేరాలు,రో డ్డు భద్రత,మహిళా మరియు బాలల రక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్సైసురేష్ మాట్లాడుతూ, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని,అనుమానాస్పద ఫోన్ కాల్స్,లింకులు, సందేశాలకు స్పందించవద్దని సూచించారు. అలాగే రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనదా రులు తప్పనిసరిగా హె ల్మెట్ ధరించాలని,కారులో ప్రయా ణించే వారు సీటు బెల్ట్ ఉపయోగిం చి తమ ప్రాణాలను కాపాడుకోవా లని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని,పిల్లలపై జరిగే లైంగిక వేధింపులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పోక్సో చట్టంపై అవగాహన పెంపొం దించుకోవాలని ఆయన పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్,అసాం ఘిక కార్యకలాపాలు, ఇతర నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరి స్థితుల్లో డయల్ 100,112,1098 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చుని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై సురేష్ హామీ ఇ చ్చారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కోట ఆర్కియాలాజీ కార్యాలయ ప్రాంగణంలో యోగా కార్యక్రమం ప్రారంభం



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి అర్బన్ భారత ప్రభుత్వం మ రియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వా ల ఆదేశాలతో అనంతపురం జిల్లా కలెక్టర్, ఆదేశాల మేరకు మంగళవారం నుండి యోగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని గుత్తి మున్సిపల్ కమీషనర్ బి. జబ్బార్ మియా తెలి పారు. స్థానిక గుత్తి కోట వద్ద ఆర్కి యాలాజీ ఆఫీసు ప్రాంగణము నం దు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో కమీషనర్ బి జబ్బార్ మియా మాట్లాడుతూ యో గాంధ్ర కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థ లు,సచివాలయం ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గురూజిలు కృష్ణా,రామకృష్ణ, ద్వారా యోగా సనాలు చేయించారు. ఇంటర్నేషనల్ కరాటే బ్లాక్ బెల్ట్ అవార్డు గ్రహీత మరియు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించిన మంజునా థ్ ఆచారి,గుత్తి కోట ప్రాముఖ్యతను నా వంతుగా రాష్ట్ర స్థాయిలో,దేశ స్థాయిలో,అంతర్జాతీయ స్థాయిలో అవగాహన పెంచుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాం బాబు,గుత్తి కోట పరిరక్షణ కమిటీ అధ్యక్షులు విజయభాస్కర్, అనంత పురం క్రైమ్ బ్రాంచ్ ఎస్.ఐ, మున్సిపల్ సిబ్బంది, మర్శన్ ఆర్ట్స్ విద్యా ర్థులు, ఆర్కియాలాజీ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )